సాక్షి ఏలూరు

మంగళవారం : 24 : డిసెంబర్ : 2024



ట్రిపుల్ ఐటీ ఔదార్యం

విద్యార్థిని ప్రాణాలు కాపాడేందుకు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం కృషి చేస్తోంది. అనూష బ్రెయిన్ స్ట్రోక్‌తో పడిపోగా వెంటనే ఆస్పత్రిలో చేర్పించి రూ.2 లక్షలు చెల్లించారు. 8లో ▸



పార్శిల్ శవం కేసు తుదిదశకు

పార్శిల్ శవం కేసు కొలిక్కివచ్చినట్లు సమాచారం. మృతుడి వివరాలు పోలీసులు గుర్తించగా.. ఈ కేసులో ప్రధాన నిందితుడిని కూడా అరెస్ట్ చేసినట్లు తెలిసింది. 8లో ▸



బంగారం వ్యాపారి అరెస్టు

పలువురు జ్యూయలర్స్ నుంచి బంగారం, వెండితో ఉడాయించిన బంగారం వ్యాపారిని తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్

ఏలూరు (టూటౌన్): సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 47 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అవగాహనను కలిగి ఉండాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై నుంచి సీబీఐ, ఈడీ అధికారులు అని చెప్పి ఫోన్లు చేసి బెదిరించి డబ్బులు చెల్లించాలని చెప్పే కాల్స్, సందేశాలపై సైబర్ క్రైమ్‌లో తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు.

ఓవర్ లోడుకు రూ.1.70 కోట్ల జరిమానా!

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఒక లారీని గుర్తించిన ఏలూరులో పని చేస్తున్న ఓ సీనియర్ వాహన తనిఖీ ఇన్స్‌పెక్టర్ ఆ వాహనానికి జరిమానా విధించారు. ఈ వాహన యజమానికి జరిమానా చూసి బెంబేలెత్తిపోయాడు. ఏలూరులో పని చేస్తున్న సీనియర్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఆదివారం వాహన తనిఖీలు చేస్తూ.. ఓ లారీపై ఓవర్ లోడ్ కేసు నమోదు చేశారు. సదరు అధికారి 3 టన్నుల అదనపు లోడ్‌కు బదులు 3 వేల యూనిట్లుగా ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. వెంటనే కంప్యూటరైజ్డ్ బిల్లు 3 వేల టన్నులకు రూ.1.70 కోట్ల జరిమానా విధించినట్లుగా రసీదు ఇచ్చింది. దీంతో లబోదిబోమంటూ బాధితుడు రవాణా శాఖ ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నాడు. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆరా తీసిన జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ ఖాసిమ్ సదరు అధికారి 3 వేల కిలోలను 3 వేల యూనిట్లుగా నమోదు చేసినట్లు గుర్తించారు. సోమవారం ఉదయం దానిని సరి చేసి విషయాన్ని వాహనదారుడికికి తెలిపినట్లు ఖాసిమ్ ఒక ప్రకటనలో తెలిపారు. వాహనానికి విధించిన జరిమానా కేవలం రూ.26,200 మాత్రమేనని స్పష్టం చేశారు.

సర్పంచుల హక్కులు కాలరాస్తున్నారు



వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ సర్పంచ్ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తూ, గ్రామ పంచాయతీ సర్పంచుల హక్కులకు సహకరించని జిల్లా, మండల స్థాయి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. తాను దెందులూరు మండలం ముప్పవరం పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నానని, గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా పనులు జరగకూడదని చెప్పినా దెందులూరు మండల ఫీల్డ్ ఆఫీసర్ (ఎంపీడీఓ)పనులు పెట్టించి తమ హక్కులను కాలరాస్తున్నారన్నారు. సర్పంచ్‌కు తెలియకుండా ఏమీ జరగకూడదని సీఎం చంద్రబాబు, పంచాయతీరాజ్ మంత్రి చెప్పిన విషయాలు గుర్తుచేశారు. దెందులూరు మండల అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీజీఆర్ఎస్ అర్జీదారులకు ప్రత్యేక బస్సులు

భీమవరం (ప్రకాశంచౌక్): పీజీఆర్ఎస్ అర్జీదారుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ప్రతి సోమవారం ప్రత్యేక ఉచిత బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మెయిన్ రోడ్డు నుంచి కలెక్టరేట్ కు వయోవృద్ధులు, వికలాంగులు చేరుకోవాలంటే రెండున్నర కిలోమీటర్లు ప్రయాణించాల్సి రావడం వ్యయ ప్రయాసలతో పాటు ఖర్చుతో కూడుకుంది. ఈ విషయమై డీఈఓతో చర్చించి ప్రతివారం ఒక స్కూల్ బస్సును రెండు ట్రిప్పులు వేసేలా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సుమారు ఉదయం 9 గంటలకు, 10 గంటలకు, తిరిగి కలెక్టరేట్ నుండి మధ్యాహ్నం 12 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు వయోవృద్ధులు, దివ్యాంగ అర్జీదారులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రియల్ కష్టాలే!

- ఆదాయార్జనే లక్ష్యంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు
- 10 నుంచి 25 శాతం పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో భారీగా పెరగనున్న భూముల ధరలు
- కొన్ని ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ కన్నా ప్రభుత్వ ధరే ఎక్కువ
- ఇప్పటికే పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం
- తాజా పెంపుతో పతనం తప్పదంటున్న రియల్ ఎస్టేట్ వర్గాలు



ఏలూరులో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కొత్త ఏడాది కూటమి సర్కారు భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేందుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే మందకొడిగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం ఈ నిర్ణయంతో పడకేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగే పట్టణ, మండల కేంద్రాల శివార్లలోని వెంచర్లను టార్గెట్ చేస్తూ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆయా ప్రాంతాల్లోని భూములపై 10 నుంచి 25 శాతం పెంపు భారం పడనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా ఏలూరు జిల్లాలో 12, పశ్చిమగోదావరి జిల్లాలో 15 ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే రెండు జిల్లాలకు చెందిన జాయింట్ కలెక్టర్లు ఆయా జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లతో సమావేశమై పెంపు ప్రతిపాదనలపై సమీక్షించారు. ఏలూరు జిల్లాలో ప్రాంతాల వారీగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు ప్రతిపాదనలు ఖరారయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు సబ్ రిజిస్ట్రార్ వర్గాలు తెలిపాయి. కొన్నేళ్లుగా పట్టణ జీవనానికి ప్రజలు మొగ్గు చూపుతుండటంతో పల్లెల నుంచి సమీప పట్టణాలకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇదే క్రమంలో పట్టణ, మండల కేంద్రాల సమీప గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నాయి. లే అవుట్లలో రిజిస్ట్రేషన్లు అధికంగా జరుగుతుండటంతో వీటిని లక్ష్యంగా చేసుకుని పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అర్బన్ ఏరియాల్లో రిజిస్ట్రేషన్ల పెంపు 10 నుంచి 20 శాతం వరకు ఉంటే రూరల్ ఏరియాల్లో 25 శాతం వరకు పెంచడం గమనార్హం. వీటి ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరనుంది.

అగమ్యగోచరంగా రియల్టర్ల పరిస్థితి

ఇప్పటికే అమ్మకాలు లేక కుదేలైన రియల్ ఎస్టేట్ రంగం తాజా పెంపుతో పూర్తిగా పతనమవుతుందని ఆ వర్గాలంటున్నాయి. ఇప్పటికే ఎంతోకొంత భూమిని వెనకేసుకున్న వారు తమ బిడ్డల చదువులు, వివాహాలు, ఇతర అవసరాల నిమిత్తం అమ్మజూపినా కొనేవారు లేక ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క కోట్లాది రూపాయలు వెచ్చించి సొంత భూములను వెంచర్లుగా మార్చిన వారు, అప్పులు చేసి డెవలప్ చేసిన వెంచర్లలో స్థలాల కొనుగోళ్లు లేక రియల్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. భూములను డెవలప్‌మెంట్‌కు తీసుకుని వెంచర్లు వేశాక అవి అమ్ముడుకాకపోతుండటంతో సంబంధిత భూ యజమానుల నుంచి రియల్టర్లు ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న మధ్యవర్తులు, దళారుల కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయి. గతంలో నెలకు ఒక్క ప్లాటు అయినా విక్రయిస్తే.. గత ఆరు నెలలుగా ఒక్క ప్లాటు కూడా విక్రయించలేని పరిస్థితి. ఇప్పుడే పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటే రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పరిస్థితి మరింత దిగజారిపోతుందన్న ఆందోళనలో ఉన్నారు.

జిల్లాలో పెరగనున్న భూముల విలువ

మండలం	అర్బన్ (శాతం)	రూరల్ (శాతం)
భీమడోలు	0–15	0–15
చింతలపూడి	10–15	10–15
జంగారెడ్డిగూడెం	0–15	0–15
కామవరపుకోట	10–20	10–25
పోలవరం	10–20	10–25
వట్లూరు	0–15	0–15
ఏలూరు	0–10	10–15
గణపవరం	10–15	10–15
కైకలూరు	10–20	10–25
మండవల్లి	10–20	10–20
ముదినేపల్లి	10–20	10–20
నూజివీడు	10–20	10–20

భూముల ధరల పెంపు ఉపసంహరించుకోవాలి



ప్రజలపై భారం మోపుతూ జనవరి 1 నుంచి భూముల ధరలు పెంచేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. భూముల ధరలు పెంచడం వల్ల కొనుగోలుదారులు తగ్గిపోతారు. దీనివల్ల ఈ రంగంపై ఆధారపడిన మీడియేటర్లు, రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద కక్షిదారులకు వివిధ విధాలుగా సేవలందించే ఎంతోమంది డాక్యుమెంట్ రైటర్లు, వారి సహాయకులు, డీటీపీ ఆపరేటర్లు ఉపాధి కోల్పోతారు.

–గంటా రాజేశ్వరరావు (తంబి), రియల్ ఎస్టేట్ మీడియేటర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బహిరంగ మార్కెట్ కంటే ఎక్కువ

సాధారణంగా భూముల ప్రభుత్వ మార్కెట్ ధరకు బయటి మార్కెట్ ధరకు 50 నుంచి 70 శాతం వ్యత్యాసం ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో గజం రూ.20 వేలు ఉంటే ప్రభుత్వ రికార్డుల్లో ధర రూ.12 వేల నుంచి రూ.15 వేల మధ్యలో ఉంటుంది. ప్రజలు భూములు కొనేటప్పుడు ప్రభుత్వ రికార్డుల ధరలకే స్టాంప్ డ్యూటీ చెల్లిస్తారు కాబట్టి వారికి లబ్ధి చేకూరేది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా కొన్నిచోట్ల బహిరంగ మార్కెట్ కంటే ప్రభుత్వ రికార్డుల్లో ధరలు అధికంగా ఉంటున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రం ఏలూరు పరిసర ప్రాంతాలైన పోణంగి టిడ్కో గృహ సముదాయం సమీపంలో బహిరంగ మార్కెట్‌లో గజం రూ.5 వేలు పలుకుతుండగా ప్రభుత్వ రికార్డుల్లో రూ.12 వేలుగా ఉంది. బూరాయగూడెంలో బహిరంగ మార్కెట్‌లో రూ.5 వేలు, ప్రభుత్వ రికార్డుల్లో రూ.12 వేలు, శాంతినగర్ వెనక దర్శనగర్‌లో బహిరంగ మార్కెట్‌లో రూ.8 వేల నుంచి 10 వేలు ఉన్న ధర ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం రూ.22 వేలుగా ఉంది. వంగాయగూడెం నుంచి కైకలూరు వెళ్లే దారిలో బహిరంగ మార్కెట్‌లో రూ.12 వేలు ఉంటే ప్రభుత్వ రికార్డుల్లో రూ.43 వేలు ఉంది. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరం సమీపంలోని విస్సాకోడేరు, రాయలంలో బయటి మార్కెట్ విలువ గజం రూ.10 వేల వరకు ఉండగా ప్రస్తుత ప్రతిపాదిత ధర రూ.15 వేల వరకు ఉన్నట్టు తెలుస్తోంది. తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం ప్రాంత శివార్లు, ఉమ్మడి జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇలాంటి వ్యత్యాసాలు అధికంగానే ఉంటున్నాయి.

ముసాయిదా కాపీల దహనం



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న రైతు సంఘ నాయకులు

ఏలూరు(టూటౌన్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్కెట్ చట్టం ముసాయిదాను తక్షణం రద్దు చేయాలని, రైతు ఉద్యమంపై నిర్బంధ చర్యలు ఆపాలని సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ముసాయిదా కాపీలను దహనం చేసి కేంద్ర ప్రభుత్వ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంఘం (అన్నే భవనం) రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు సంఘం (స్ఫూర్తి భవనం) రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోరండ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకుడు రాజనాల రామ్మోహనరావు, ఏఐకేకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డిహెచ్. రంగనాథం, రైతు కూలీ సంఘం(ఆంధ్ర ప్రదేశ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.కె.బాషా, బికేయంయు జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు కె.వి రమణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చకు రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులతో జరిపే పరీక్షా పే చర్చకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే జనవరి 14 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు అందరు ప్రధానోపాధ్యాయులు పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సంసిద్ధం చేసి 100 శాతం రిజిస్ట్రేషన్‌లు జరిగేలా చేయాలని ఆదేశించారు.

విద్యుత్ చార్జీలపై పోరుబాట

- షాక్‌ల మీద షాకులిస్తున్న కూటమి ప్రభుత్వం
- 27న ప్రతి నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు



వైఎస్సార్‌సీపీ పోరుబాట వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జులు జయప్రకాశ్, విజయరాజు తదితరులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు షాకులమీదు షాకులిస్తోందని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు విద్యుత్ చార్జీలు అసలు పెంచనని చెప్పి ఎంత మోసం చేశారో ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలలు తిరగకుండానే జనంపై చార్జీల మోత మోగించడం దారుణమన్నారు. అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడానికి తీసుకున్న నిర్ణయం, క్లాసిఫికేషన్ పేరిట ప్రభుత్వ వనరులన్నీ ఏం చేస్తారని ప్రశ్నించారు. ఒక్క నవంబర్‌లోనే ప్రజలపై రూ.15,485.36 కోట్ల భారం మోపడం వాస్తవం కాదా! అని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ పథకాల వైఫల్యం గురించి మాట్లాడాలంటే ఒక రోజు చాలదని ఎద్దేవా చేశారు. తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్రంలో కొత్త అలజడులు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల పెంపుపై ఈ నెల 27న జిల్లా కేంద్రం ఏలూరులో పోరుబాట నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే రోజున ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఆయా నియోకవర్గాల ప్రతినిధులు కూడా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ధరలు ఆకాశాన్నంటుతున్నాయి : జేపీ

వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాశ్ మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రం ఏలూరులోని విద్యుత్ భవన్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు ఉచిత కరెంటును ఎత్తివేశారని, ఇప్పుడు రైతులు బిల్లులు కట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ప్రజలు కొనుగోలు చేయలేక, ఏమి తినాలో అర్థంకాక పస్తులు పడుకుంటున్నారన్నారు. చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే రెండుసార్లు చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరిచారన్నారు. అనంతరం పార్టీ నాయకులు పోరుబాటకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ నాయకులు మున్నుల జాన్ గురునాథ్, గుడిదేశి శ్రీనివాస్, కిలాడి దుర్గారావు, నూకపెయ్యి సుధీర్ బాబు, ఎండీ ఖైసర్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా మోహన రావు, దాసరి రమేష్, దేవరకొండ నాగేశ్వర రావు, తులసి, పెరికే వరప్రసాద్, డీవీఆర్‌కే చౌదరి, ఎచ్చెర్ల ఉమా మహేష్, బండ్లమూడి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై వచ్చిన అర్జీలను సానుకూలంగా పరిష్కరించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారంకోసం వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతుల నుంచి అర్జీలు స్వీకరించేందుకు వేదిక కిందకు వచ్చి వారి సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల వైకల్యాన్ని గుర్తించి సదరం ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డు, పెన్షన్ మంజూరుకు ఆయా శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మధుమేహం వల్ల తన కాలు తీసివేశారని, కుడికాలుకు సంబంధించి సమస్య ఉందని, సదరం ధ్రువీకరణ పొందానని ప్రస్తుతం ఇస్తున్న రూ.6 వేల పెన్షన్‌ను రూ.15 వేల పెంపునకు చర్యలు తీసుకోవాలని భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన చింతా రవి కుమార్ కోరారు. ఉంగుటూరు మండలం వెల్లమెల్లికి చెందిన ఉమ్మట్ల నాగమణి పింఛన్ మంజూరు కోసం నూతన బియ్యం కార్డు ఇవ్వాలని కోరారు. అవసరమైన చర్యలకోసం సంబంధిత అధికారులకు కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు.

దివ్యాంగులకు ప్రత్యేక సేవా కేంద్రం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వినతులిచ్చే అర్జీదారుల సౌకర్యార్థం కలెక్టర్ పలు ఏర్పాట్లు చేశారు. కుర్చీలు, తాగునీటి సౌకర్యాలు కల్పించారు. విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దివ్యాంగుల కొరకు ప్రత్యేక రిసెప్షన్ కౌంటరు ఏర్పాటు చేశారు. వారి సమస్యలకు సంబంధించి అర్జీలను రాసేందుకు సహాయ కేంద్రం నెలకొల్పారు. దివ్యాంగుల కోసం మూడు చక్రాల సైకిళ్లు అందుబాటులో ఉంచారు. అర్జీలు సమర్పించేందుకు అవసరమైన వారికి మూడుచక్రాల సైకిళ్లను ఏర్పాటు చేసి వేదిక వరకు తీసుకువెళ్లే ఏర్పాట్లు చేశారు.

అందిన అర్జీల్లో కొన్ని

- తన భూమిని తన నుంచి స్వాధీనం చేసుకోవాలని కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని, తన భూమిని సర్వేచేసి ఇప్పించాలని కొయ్యలగూడెం మండలం ధర్మారావుపేట కు చెందిన పెనుమత్స శ్రీరామరాజు కోరారు.
- తన భూమి ఆన్ లైన్ చేయించాలని జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంకు చెందిన వెంకటేశ్వరరావు అర్జీ అందజేశారు.
- పాస్‌బుక్ ఆధారంగా తన భూమిని చూపించాలని కుక్కునూరు మండలం సీతానగరానికి చెందిన కొయ్యల అశోక్ అర్జీ పెట్టుకున్నారు.
- గుర్రమ్మకుంట చెరువు ఆక్రమణతో రైతులు ఇబ్బంది పడుతున్నారని దెందులూరు మండలం శ్రీరామవరానికి చెందిన శ్రీనివాసరావు అర్జీ పెట్టుకున్నారు.
- తమ భూమిని కొలిపించి సర్వే చేసి అప్పగించాలని లింగపాలెం మండలం రాయుడుపాలెంకు చెందిన వెంపాటి స్వాతి కోరారు.

27న ఎస్సీ వర్గీకరణ కమిషన్ పర్యటన

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణపై విచారణకు నియమించిన కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా ఈనెల 27న జిల్లాలో పర్యటించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

రోలర్ స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో ఈనెల 5వ తేదీన నిర్వహించిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో తణుకు మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు సత్తా చాటి విజేతలుగా నిలిచారు. ఇన్‌లైన్ హాకీ కాడెట్ అండర్-11 విభాగం నందు మైత్రి దాస్ బంగారు పతకం, రోరల్ మిక్స్‌డ్ హాకీ కాడెట్ అండర్-11 విభాగం నందు కె.నితేష్ గౌడ్ కాంస్య పతకం, రోలర్ మిక్స్‌డ్ హాకీ సబ్ జూనియర్ అండర్-14 విభాగం నందు జి.జస్వంత్ కాంస్య పతకంలను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలెక్టరేట్ చాంబర్ నందు కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి, మాంటిస్సోరి స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.జ్ఞాన మంజరి, ఆంధ్రప్రదేశ్ టీమ్ కోచ్ ఏ.భార్గవ్, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ నందమూరి రాజేష్, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.రాజేష్ ఉన్నారు.

27న క్రికెట్ సెలెక్షన్స్

ఏలూరు రూరల్ : ఈ నెల 27వ తేదీన ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల ఆవరణలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ జట్టు సెలక్షన్స్ నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు జి ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు సంయుక్త ప్రకటనలో తెలిపారు. జట్టుకు ఎంపికైన వారు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించబోయే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గలవారు పుట్టినతేదీ సర్టిఫికెట్, ఆధార్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో శుక్రవారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

గేదెను కాపాడదామని వెళ్లి..



రాజు మృతదేహం

చింతలపూడి : గేదెను కాపాడదామని వెళ్లి చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. చింతలపూడి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన అనుపోజు ధర్మలింగాచారి (55)కు పాడి గేదె ఉంది. చెరువులోకి దిగిన గేదె మెడకు కాలికి బంధం ఉండటంతో ఈత కొట్టలేక గిలగిలాడుతున్న పరిస్థితిని రాజు గమనించి చెరువులోకి దిగి ఆ బంధాన్ని తొలగించాడు. అయితే అప్పటికే మరణించిన గేదె రాజుపై పడిపోవడంతో ఉక్కిరిబిక్కిరి అయి ప్రాణాలు వదిలేశాడని గ్రామస్తులు తెలిపారు. రాజుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి..



నాగమునేశ్వరరావు (ఫైల్)

పాలకొల్లు అర్బన్: మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు పాలా నాగ మునేశ్వరరావు (64) సోమవారం సాయంత్రం చెట్టుపై నుంచి పడి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు పాలకొల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రిస్మస్ కాంతులు




ఏలూరు ఆదివారపుపేట చర్చిలో క్రిస్మస్ ట్రీ



కాళ్ళ మండలం ప్రాతాళ్ళమెరకలో విద్యుత్ దీపాలంకరణలో చర్చి



ఏలూరు సీఎస్ఐ చర్చి వద్ద పశువుల పాక సెట్టింగ్



విద్యుత్ కాంతుల్లో ఏలూరు అమీనాపేటలోని లూథరన్ చర్చి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. రకరకాల విద్యుత్ దీపాలతో చర్చిలను సుందరంగా అలంకరించారు. ఏసు జన్మదినానికి అర్థం పట్టేలా ఏర్పాటు చేసిన పశువుల పాకలు, క్రిస్మస్ ట్రీలు విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంటున్నాయి. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు, కాళ్ల

తుది దశకు పార్శిల్‌లో శవం కేసు

- మృతుడు కాళ్ల మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు
- అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు !



పార్శిల్‌లో శవం వచ్చిన చెక్కపెట్టె ఇదే

ఉండి: రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన యండగండి పార్శిల్‌లో శవం కేసు ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తుంది. మృతుడి వివరాలు తెలిసినట్లు సమాచారం. అలాగే ఈ కేసులో ప్రధాన నిందితుడిని కూడా పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. అయితే ఈ వివరాలను పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. ఈనెల 19వ తేదీ సాయంత్రం యండగండి రాయపేటలోని ముదునూరి రంగరాజు ఇంటికి ఆటోలో పార్శిల్‌లో ఓ శవం వచ్చింది. ఆ శవం ఎవరిదీ, దోషి ఎవరు, హత్యకు గల కారణాలు వంటి వివరాలు పోలీసులకు సవాల్‌గా మారాయి.

మృతుడి ఆచూకీ గుర్తింపు

పార్శిల్‌లో ఉన్న మృతదేహం కాళ్ల మండలం గాంధీనగర్‌కు చెందిన బర్రే పర్లయ్యగా గుర్తించినట్లు సమాచారం. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యసనాలకు అలవాటుపడటంతో కుటుంబ సభ్యులు పట్టించుకోవడం మానేశారు. అయితే చనిపోయే రెండు రోజుల ముందు అనుమానితుడు శ్రీధర్‌వర్మ వద్ద పనికి వెళ్లినట్టు తెలిసింది. అప్పటి నుంచి పర్లయ్య కనిపించకపోవడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించి హత్యకు గురైంది పర్లయ్య అని నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది.

రహస్యంగా విచారణ

పార్శిల్‌లో శవం ఘటన జరిగి ఇప్పటికీ నాలుగు రోజులు గడుస్తుంది. అనుమానిత మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం పర్లయ్యను హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ కేసులో ముదునూరి రంగరాజు అతని భార్య హైమావతి, కుమార్తెలు రేవతి, తులసీలతో పాటు కాళ్ళ మండలంలోని అనుమానితుడు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతాల్లో ఒకరికి తెలియకుండా మరొకరిని విచారించినట్లు తెలుస్తుంది.

పోలీసుల అదుపులో నిందితుడు!

పోలీసుల గాలింపులో భాగంగా ఎరుపు రంగు కారు ప్రయాణించిన మార్గంలో సీసీ టీవీ కెమెరాలను పరిశీలిస్తూ కృష్ణా జిల్లా బంటుమిల్లి గ్రామంలో ఓ వృద్ధుడి వివరాల ఆధారంగా పోలీసులు బృందంతో వెళ్లి నిందితుడు శ్రీధర్‌వర్మ, శవం ఉన్న చెక్క పెట్టెను ఆటోలో ఎక్కించిన మహిళను అదుపులోకి తీసుకుని భీమవరం తీసుకువస్తున్నట్టు సమాచారం.

హత్య అందుకోసమేనా?

ఈ కేసులో ప్రధాన అనుమానితుడు శ్రీధర్‌వర్మ బర్రే పర్లయ్య అనే వ్యక్తిని హత్య చేసి ఆ హత్యానేరాన్ని తన వదిన, అత్తామామలపై మోపాలని చూస్తున్నట్లు తెలుస్తుంది. అత్తమామల వద్ద ఉన్న మూడెకరాల పొలం, ఇల్లు ఇతర ఆస్తి తాను కాజేయాలని పథకం ప్రకారమే ఇదంతా చేసినట్లు అనుమానిస్తున్నారు.

అనుమానితుడు చిన్నల్లుడేనా..

ఈ కేసులో రంగరాజు చిన్నల్లుడు, రేవతి భర్త శ్రీధర్‌వర్మ అలియాస్ సిద్ధార్థ, సుధీర్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్నారు. పోలీసుల విచారణలో శ్రీధర్ వర్మ గురించి విస్తుపోయే నిజాలు తెలుస్తున్నాయి. ఒకరికి తెలియకుండా ఒకరిని మొత్తం ముగ్గురు మహిళలను అతడు వివాహం చేసుకున్నట్టు తెలుస్తుంది. ఇతని మొదటి భార్యది కాళ్ళ మండలం ఎస్సీ బోస్ కాలనీ పంచాయతీలోని ఇస్కులంక. వీరంతా కాళ్ళ మండలంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్నారు. రెండవ భార్యగా ప్రస్తుత కేసులో విచారణ ఎదుర్కొంటున్న రేవతి. మూడో భార్యది కాళ్ల గ్రామం. అలాగే అతను నేర ప్రవృత్తి కలిగినవాడుగా పోలీసులు భావిస్తున్నారు. కాళ్లలోని అతని ఇంట్లో మృతదేహాన్ని పార్శిల్ చేసిన చెక్కపెట్టె మాదిరి మరో పెట్టె ఉండటాన్ని పోలీసులు గమనించినట్లు సమాచారం.

చీటింగ్ కేసు నిందితుడు జైలుకు తరలింపు

కైకలూరు: కీర్తన ఫైనాన్స్ కంపెనీలో చీటింగ్ చేసిన ఏ-2 నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు మచిలీపట్నం జైలుకు తరలించినట్లు కైకలూరు పట్టణ సీఐ పి.కృష్ణ సోమవారం తెలిపారు. కైకలూరు కీర్తన ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ రుద్రపాటి సూర్యం, వైస్ ప్రెసిడెంట్ రుద్రపాటి స్కైలాబ్ కస్టమర్ల నుంచి డాక్యుమెంట్లు తీసుకుని వారి పేర్ల మీదు లోన్లు తీసుకుని రూ.25 లక్షలు మోసం చేశారన్నారు. దీనిపై కీర్తన ఫైనాన్స్ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. వీరిలో ఏ-1 రుద్రపాటి సూర్యంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఏ-2 నిందితుడు రెడ్డిగూడెం మండలం ముచ్చునపల్లికి చెందిన స్కైలాబ్ ఈ నెల 13న లాయరు సాయంతో కోర్టులో లొంగిపోయాడన్నారు. అతడిని పోలీస్ విచారణకు కోరగా మేజిస్ట్రేట్ ఈ నెల 21 నుంచి 23 వరకు అవకాశం ఇచ్చారన్నారు. విచారణ అనంతరం సోమవారం తిరిగి కై కలూరు కోర్టులో హాజరుపర్చగా జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులతో మచిలీపట్నం జైలుకు పంపించినట్లు సీఐ చెప్పారు.

బంగారం వ్యాపారి అరెస్ట్

- రూ.8 కోట్ల విలువైన బంగారం, వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ డి విశ్వనాథ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ డి విశ్వనాథ్, చిత్రంలో సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్సై పి.నాగరాజు

తాడేపల్లిగూడెం అర్బన్: పలువురు జ్యూయలర్స్ దుకాణదారుల నుంచి బంగారం, వెండి తీసకుని ఉడాయించిన బంగారం వ్యాపారిని తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన లెంకా మోహనరావు కొన్నేళ్లుగా బంగారం వ్యాపారం చేస్తున్నాడు. వాయిదాల పద్ధతిలో నగదు చెల్లిస్తే వాయిదాలు పూర్తయిన అనంతరం నగదుకు సరిపడా బంగారు వస్తువులు ఇస్తామని పట్టణ వాసులతోపాటు పరిసర గ్రామాల ప్రజల నుంచి సొమ్ములు వసూలు చేశాడు. ఇదిలా ఉండగా కొన్ని నెలల క్రితం తాడేపల్లిగూడెం ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో ఒక షాపును అద్దెకు తీసుకుని తన భార్య పేరున మన్వి జ్యూయలర్స్ బంగారం షాపును ప్రారంభించాడు. పట్టణంలోని పలువురు బంగారం వ్యాపారుల నుంచి బంగారాన్ని, వెండిని అప్పుగా తీసుకుని నెలనెలా వడ్డీని చెల్లిస్తున్నాడు. అయితే కొందరికి గడువు తీరినా బంగారం ఇవ్వకపోగా రోజూ మాట దాటవేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా బంగారు షాపును సైతం తెరవకపోవడంతో వాయిదాల పద్ధతిలో సొమ్ములు చెల్లించిన వినియోగదారులు అతని కుటుంబ సభ్యులను ఆరా తీయగా తమకు తెలియదని చెప్పారు. దీంతో మోసపోయామని బాధితులు గ్రహించారు. ఇదిలా ఉండగా తనను మోసం చేసి బంగారాన్ని కాజేశాడని నరసాపురానికి చెందిన కుహద్ అనిల్‌కుమార్ జైన్ స్థానిక పట్టణ పోలీసులకు లెంక మోహనరావుపై ఫిర్యాదు చేశాడు. ఇతనితోపాటు బంగారు వస్తువులకు సొమ్ములు చెల్లించిన మరికొందరు వినియోగదారులు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆదేశాల మేరకు డీఎస్పీ డి విశ్వనాథ్ సూచనలతో పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం దర్యాప్తు ప్రారంభించారు. మోహనరావు భార్యను అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు విశాఖపట్టణం, హైదరాబాద్ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు తెలియడంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ సమీపంలో నిందితుడు మోహన్‌రావును గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. తాడేపల్లిగూడెంలోని మహాలక్ష్మీనగర్‌లో అతని ఇంటిని సోదాచేయగా 6.758 కిలోల బంగారు ఆభరణాలు, బంగారు బిస్కెట్లు, 106.772 కిలోల వెండి వస్తువులు, రూ.3 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. మోహనరావుపై 318(4), 316(5) బీఎన్ఎస్ సెక్షన్లతో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ సుమారు 7 కోట్లు, వెండి విలువ సుమారు రూ.కోటి కలిపి మొత్తం రూ.8 కోట్లు పైనే ఉండవచ్చని అంచనా వేశారు.

ఆభరణాలు తయారు చేసి ఇస్తానని మోసం

పట్టణంలోని కొందరు బంగారు వ్యాపారాలు వినియోగదారుల నుంచి ముడి బంగారాన్ని తీసుకుని బంగారు ఆభరణాలు తయారు చేయించి ఇస్తారు. ఈ విధంగానే తాను బంగారు ఆభరణాలు తయారు చేయించి ఇస్తానని నమ్మబలికి బంగారు వ్యాపారుల వద్ద నుంచి, కస్టమర్ల వద్ద నుంచి రూ.84.36 లక్షలు విలువైన 1.406 కిలోల బంగారాన్ని, తరుగు మజూరు అని రూ.1.9 లక్షలు తీసుకున్నాడు. మొత్తం రూ.85.45 లక్షలు విలువ గల బంగారాన్ని తమను నమ్మించి తీసుకున్నాడని బాధితులు పోలీసులకు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ డి.విశ్వనాథ్‌తోపాటు పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్సై పి.నాగరాజు ఉన్నారు.

అడ్డగోలుగా ఘాట్ రోడ్డు నిర్మాణం

- నల్లగట్టుపై రోడ్డు నిర్మాణాన్ని చూసి తహసీల్దార్ ఆశ్చర్యం
- రోడ్డు నిర్మించాల్సిన అవసరమేమిటని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు



నల్లగట్టు పైకి నిర్మించిన ఘాట్ రోడ్డు



రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ బీవీ సుబ్బారావు

నూజివీడు: ప్రజాప్రతినిధుల అండ చూసుకుని నలగట్టుపై దట్టంగా పెరిగిన చెట్లను తొలగించేసి ఏకంగా కిలోమీటర్ మేర ఘాట్ రోడ్డు నిర్మించడం గ్రామస్తులతోపాటు అధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. నూజివీడు మండలంలోని పాత రావిచర్ల పరిధిలోని నల్లగట్టు పైభాగాన ఓ విద్యాసంస్థ యాజమాన్యం ఒడిగట్టిన ఈ దుస్సాహసాన్ని చూసి రెవెన్యూ అధికారులే నివ్వెరపాయారు. పట్టణం నుంచి విజయవాడ వెళ్లే రోడ్డులో ఉన్న ఒక విద్యాసంస్థ యాజమాన్యం నల్లగట్టుపై అక్రమంగా ఘాట్‌రోడ్డు వేస్తున్న విషయాన్ని ఆదివారం రెవెన్యూ అధికారులకు తెలపడంతో తహసీల్దార్ బీవీ సుబ్బారావు ఆర్ఐ అశోక్‌కుమార్, వీఆర్వోలను పంపి నిలుపుదల చేయించి పొక్లయిన్‌ని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో నల్లగట్టుపై జరిగిన తవ్వకాలను తహసీల్దార్ సుబ్బారావు సోమవారం పరిశీలించారు. కాలినడకన ఆయన గట్టుపై వరకు ఎక్కి ఘాట్ రోడ్డును పరిశీలించారు. దాదాపు కిలోమీటరుకు పైగా గట్టుపైన దట్టంగా పెరిగిన చెట్లను తొలగిస్తూ వేసిన మట్టిరోడ్డును చూసి తహసీల్దార్‌తో పాటు గ్రామస్తులు సైతం విస్మయం వ్యక్తం చేశారు. గట్టు కింద నుంచి పైభాగానికి ఇలా రోడ్డు వేయాల్సిన అవసరమేమిటనే ప్రశ్న వారి నుంచి వ్యక్తమైంది. ఈ గట్టు వద్ద యజమానికి రెండు ఎకరాల పట్టా భూమి ఉండగా, మరో ఆరు ఎకరాల చేతులు మారిన అసైన్‌మెంట్ భూమి ఉండగా వాటిలో శాశ్వత కట్టడాలు కట్టడమేమిటని తహసీల్దార్ ప్రశ్నించారు. పట్టా భూమిలో నిర్మించాలన్నా ల్యాండ్ కన్వర్షన్ చేసుకోవాల్సి ఉంటుందని, అసైన్‌మెంట్ ల్యాండ్‌లో ఎలాంటి కట్టడాలు నిర్మించడానికి లేదని పేర్కొన్నారు. ఇక్కడ వేసిన ఘాట్ రోడ్డును చూస్తే నాలుగైదు రోజులు క్రితమే రోడ్డు పనులు నిర్వహించారనేది స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామస్తులు కూడా అదే విషయాన్ని చెబుతున్నారు. స్కూల్ యాజమాన్యానికి కొందరు టీడీపీ నాయకుల మద్దతు ఉందని, దాని వల్లనే ఇంత ధైర్యంగా గట్టుపైకి రోడ్డును వేస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే వ్యవసాయభూమిలో షెడ్డులు వేయడంపైనా చర్యలు తీసుకునేందుకు తహసీల్దార్ నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

గ్రామస్తుల ఆగ్రహం

రెవెన్యూకి చెందిన నల్లగట్టును ఆక్రమించుకోవడానికి ఘాట్‌రోడ్డును నిర్మిస్తుండటంపై పాఠశాల యాజమాన్యంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు ఆదమరిస్తే గట్టు పైభాగంలో సమతలంగా ఉన్న 20 ఎకరాలకు పైగా ఉన్న భూమిని ఆక్రమించేసి ఉండేవారని పేర్కొంటున్నారు. గట్టు పైభాగానికి ఏ సంబంధం లేని ప్రైవేటు వ్యక్తి రోడ్డు నిర్మించాల్సిన పనేమిటని ప్రశ్నిస్తున్నారు. నీ భూమి ఎంత వరకు ఉందో అందులోనే ఉండాలి గాని ఇష్టారాజ్యంగా కొండను కబళిస్తామంటే సహించేది లేదన్నారు. జీవాలకు మేత లభ్యమయ్యే పచ్చని కొండను నాశనం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమని పేర్కొంటున్నారు.

బాలికను మోసం చేసిన కేసులో ఇద్దరి అరెస్ట్

ఏలూరు (టూటౌన్): విద్యార్థిని ప్రసవానికి కారణమైన ఇద్దరు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ డీ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాలివి. ఏలూరు అశోక్ నగర్‌లోని సెయింట్ జోసఫ్ ఆధ్యాత్మిక కేంద్రం బాలికల హాస్టల్‌లో చదువుకుతున్న విద్యార్థిని (16) ఈనెల 8వ తేదీన బిడ్డకు జన్మనిచ్చింది. ఆ నవజాత శిశువును హాస్టల్ భవనం మూడో అంతస్తునుంచి కింద పడవేశారు. ఆమె గర్భానికి కారణమైన దెందులూరు మండలం అక్కిరెడ్డిగూడెంకు చెందిన జుజ్జూరి అఖిల్ (24), నంద్యాల జిల్లా చాపిరేవుల గ్రామానికి చెందిన దండు రాజీవ్ (30)గా గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు. అఖిల్ హాస్టల్ సమీపంలోనే ఎదురుగా ఉన్న ప్రైవేట్ స్కూల్‌లో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తూ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడగా, సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌లో ట్యూషన్ చెప్పడానికి వచ్చే దండు రాజీవ్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి లోబరుచుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ ఔదార్యం

- ఈనెల 19న ప్రథమ సంవత్సరం విద్యార్థినికి బ్రెయిన్ స్ట్రోక్
- సత్వరమే స్పందించి విజయవాడలో చికిత్స చేయిస్తున్న యాజమాన్యం



విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనూష

నూజివీడు: హఠాత్తుగా అస్వస్థతకు గురైన విద్యార్థిని ప్రాణాలు కాపాడేందుకు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం తమ వంతు కృషి చేస్తోంది. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వైద్యులతో చర్చిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ట్రిపుల్ ఈ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎం.అనూష ఈనెల 19న రాత్రి 10గంటల సమయంలో రూమ్‌లో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి పడిపోవడం జరిగింది. దీంతో వెంటనే డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్, ఏఓ బీ లక్ష్మణరావు ఆమెను విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ వారు మణిపాల్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్లగా వాళ్లు ముందుగా రూ.2 లక్షలు చెల్లించాలనడంతో అప్పటికప్పుడు డైరెక్టర్ అమరేంద్రకుమార్ తోటి ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీతో చర్చించి రూ.2 లక్షలను ఆసుపత్రికి చెల్లించారు. అంతేగాకుండా క్యాంపస్‌లోని హెల్పింగ్ హ్యాండ్ సంస్థతో చెప్పగా వారు గంటలో రూ.1.30 లక్షలు సేకరించి ఆసుపత్రిలో విద్యార్థిని వైద్య ఖర్చులకు అందజేశారు. అలాగే డైరెక్టర్ రెండుసార్లు విజయవాడలోని ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో సమీక్షించారు. శ్రీకాకుళంలోని గుజరాతీపేటకు చెందిన విద్యార్థిని అనూష కుటుంబం నిరుపేద కుటుంబం. రెక్కాడితేనే గాని డొక్కాడే పరిస్థితి ఉండటంతో వారి తల్లిదండ్రుల చేతిలో చిల్లిగవ్వ లేదు. ఈ పరిస్థితుల్లో దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి తమకు తోచినంత సాయం చేయాలని ట్రిపుల్ ఐటీ వర్గాలు కోరుతున్నాయి. అలాగే ప్రభుత్వం కూడా విద్యార్థిని వైద్య ఖర్చులకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.